# వినోదయాత్ర

## ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

1911-1987

**ఆ**యన వచనం రాసినా, పద్యం చెప్పినా, మాట కలిపినా మంచి మాటకారి. పద్య కావ్యాలు రాశారు. ఆంధ్ర కవితపై సమగ్రమైన గ్రంథాన్ని వెలయించారు. గౌతమీ గాథలు పేరిట కొన్ని జ్ఞాపకాలు అందించారు. "సృష్టిలో తీయనిది స్నేహమేనోయి..." లాంటి కలకాలం మిగిలిపోయే పాటలు రాశారు. అనేక వ్యాసాలు రాశారు. సంస్కృతాంధ్రాలు క్షుణ్ణంగా చదువుకున్న పండితులు. ఏభై యేళ్లలో పట్టుమని పాతిక కథలు మాత్రమే రాశారు. "మౌనసుందరి - ఇతర కథలు" పేరిట ఇంద్రగంటి వారి కథలు సంపుటిగా రానున్నాయి. ఈ కథ 1940లలో భారతిలో వచ్చింది. దీపావళి కానుకగా మా పాఠకులకు అందిస్తున్నాం.

**ఆ**దివారం ఉదయం సుమారు 7 గంటలకు -

శృంగవరపుకోట బస్సుస్టాండుకు వచ్చి బస్సు ఆగింది.

రోడ్డు ధూళీ, కూలీల ఆక్రందనాలూ రేగి ఆగిన తర్వాత బస్సులోంచి దిగారు - హిస్టరీ లెక్చరర్ అహోబలశాస్త్రి ఎం.ఏ. గారూ, మరి ఏనమండుగురు స్టూడెంట్సూ.

జోడా థెర్మోఫ్లాస్కులూ, రెండు సిగరెట్ టిన్నులూ, ఒక చేతిసంచీమాత్ర సహాయులైన వారి అవతరణం చూడగానే 'సదరు' మానవులు ఏదో ఉత్సాహ యాత్రకు బయలురి వుంటారని తజ్ఞులు ఊహించగలరు.

పూర్వ దేవాలయాలు, శిలా శాసనాలు, శిల్ప విశేషం, క్షేత్రాలూ అంటే అహోబలశాస్త్రి గారికి చాలా సరదా.

కాలేజీలో లెక్చరరుగా వచ్చి ఆట్టేరోజులు కాలేదు. పడుచువాడు. ఇంకా 'చదువుల శాల' అనారోగ్యవర్తనంలో దించుకుపోనందువల్ల పాత ఉపాధ్యాయుడి మొహం పడలేదు. చదువుకునే పిల్లలకు ఆయన వద్ద దొంగ భయం గాని, దుర్వినయం గాని లేవు. చనువైన అన్న గారి దగ్గరలా ఉంటారు,

వారానికి ఒకటిగా - చుట్టుపట్ల వుండే ప్రాచీన దేవాలయాలనూ, శిలాశిల్పాలనూ, సుందర పర్వత ప్రదేశాలనూ, పిల్లలతో వినోదయాత్రగా వెళ్లి చూడడం, పురాభారత వైభవాన్ని వ్యాఖ్యానించడం, శాస్త్రిగారికి పరిపాటి అయింది.

ఈవారం 'పుణ్యగిరి' ఎక్స్‌కర్షన్ వేసుకున్నారు.

"ముందుగతి కానవే చిలకా" అని తలకు చుట్టుకున్న ఉలెన్ కంఫర్టు తీసి కేశవరావు పాడుతూ ఆవలించాడు.

"ముందుగతి కేముంది? అదిగో ఎదురుగా అరవ కాఫీశాల - పదండి" అన్నాడు వీరభద్రం. "ఒంద్రే కాలణా - ఒరిడ్లీ...అరకప్ కాఫీ" అని బిగ్గరగా వినబడుతున్నాయి.

"అరవం అరవం అంటూ ఎంతగా అరుస్తారోయ్" అంటూ మేష్టారు శిష్యగణంతో కాఫీశాలలో ప్రవేశించారు.

• • •

అరగంటలో కాఫీలు పూర్తి అయాయి.

శాస్త్రిగారు హోటలు పక్క కొట్లో తాజాగా కట్టిన కిళ్లీ ఒకటి నములుతూ "ఏమోయ్, పెట్రోలు కొట్టించావూ" అన్నారు ఒక కారు ఓనరు దర్జాలో. "చిత్తం - రెడీ సార్" అన్నా డు ప్రకాశరావు డ్రైవరులాగ. అప్పుడే కంఠదఘ్నంగా 'టీ'తో నింపిన ఫ్లాస్కుల మూతలు పెడుతూ.

శాస్త్రిగారికి కాఫీ హోటలును పెట్రోలు బంక్ అనడం సర్దా.

"అట్టే పెళ్లి నడకలు నడవకండి. రానూపోనూ అయిదారు మైళ్ళు నడిచి మళ్లా మధ్యాహ్నం బస్సుకు అందుకోవాలి - క్విక్ క్విక్" అంటూ నాలుగడుగులు ముందుకువేసి శుభ్రమైన "గోల్డుఫ్లేక్" ఒకటి వెలిగించి అగ్రభాగాన్ని ధూమ్రవలయాలతో నింపారు శాస్త్రిగారు.

"అదిగో - మన వినోదయాత్రా స్పెషల్ తాలూకు ఇంజెన్, పొగలు కక్కుతూ బయలు దేరింది - గెట్ రెడీ" అంటూ కిళ్లీ కొట్టులో చిల్లర లెక్క తెమలక యుద్ధం చేస్తున్న కేశవ రావు ఎట్టకేలకు బయలుదేరాడు.

"ఆల్‌రైట్ - అయితే ఇంజన్‌లోంచి మాత్రమే పొగ

ఆణిముత్యాలు

రావాలి. మిగతా పెట్టెల్లోంచి రాకూడదు" అంటూ శాస్త్రిగారు సిగరెట్ టిన్నులు రెండూ హేండ్‌బాగ్‌లో పెట్టి దాచేశారు.

"కాని ఒక్క ఇంజన్ ఎత్తు ప్రదేశంలో లాగలేదు గనక వెనక్కాల రెండో యింజన్ కట్టడం చాలా ఉత్తమం" అని కేశవరావు పూర్వార్జిత శ్వేతకాష్ఠం తీసి వెలిగించాడు.

వినోదయాత్రా స్పెషల్ పొగలు కక్కుతూ బయలు దేరింది.

శివరాత్రికి పుణ్యగిరిలో గొప్ప తీర్థం జరుగుతుంది. జిల్లా నాలుగు మూలలనుంచి యాత్రాపరులు వస్తూంటారు.

మోక్షలక్ష్మికి దగ్గర చుట్టాలైన బైరాగులు, జంగాలు, పురోహితులు - 'అపిచ' వితంతు వులూ, వచ్చి తీర్థానికి మాంచి నిండు కలిగిస్తారు.

శివరాత్రి వెళ్లి అట్టేకాలం కాలేదు. బైరాగులు కంఠంలోతు పాతుకుని డబ్బులకోసం మహత్తు చూపే గోతులూ, అడవి అంతా ప్రతి చెట్టుకిందా కనబడే 'యాత్రీకుల' వంట పొయ్యిలూ, మంచం మిఠాయి దుకాణాలకోసం నరికి పారవేయగా మిగిలిన చెట్టు మొదళ్లూ ఇంకా పూర్తిగా చెరిగిపోలేదు.

అమాయకపు అడవి పువ్వులతో, పేరు తెలియని ఏవేవో సోగ మొక్కలతో, సెలయేళ్ళతో, స్వచ్ఛమైన నల్లరాళ్ళతో వుండే అడవి అందాన్ని దుర్మార్గులు నాశనం చేస్తారు సంవత్సరానికోసారి చేరి! మహానుభావుడు నరుడు పాదం పెడితే చాలు పచ్చగడ్డి భగ్గుమంటుంది!

విద్యార్థులు, శాస్త్రిగారూ శుభ్రమైన, విశాలమైన ఒక పణుకు మీద నడుస్తున్నారు. ఒక ఫర్లాంగుమేర ఒకటే నల్ల శానపురాయి తీర్చిదిద్దిన తారురోడ్డులా పరుచుకుని వుంది. దాని కుడివైపున చూస్తే కళ్ళు తిరిగేటంత అగాధంలో - నిర్మలమైన నీటితో - కొండరాళ్ళ మీద గలగలమంటూ ఒక సెలయేరు పారుతోంది. ఉదయ సూర్య కిరణాలు పడి కరిగి పారే బంగారపు నీరులా మెరుస్తోంది. నీటికి దగ్గరగా వున్న అడవి మొక్కలు గాలికి పూల తలలను కొద్దిగా కదుపుతున్నాయి. ఏ మూల నుంచో ప్రాతఃకాలపు చలిగాలితో అడవిమల్లె వాసన గుప్పుమంటోంది.

శాస్త్రిగారు చట్టున ఆగి అన్నారు - "ఇలాంటి శాంత వాతావరణంలో - శీతల తరుచ్ఛాయల్లో మన మునీశ్వరులు వేదం పలికారు. ఉపనిషత్తులు గానం చేశారు. శాస్త్రాలు నిర్మించారు. శిష్యుల కుపదేశించారు. జాతి పుష్కలంగా బతికివున్న రోజులవి. ఇప్పుడా? టైముటేబిళ్లూ, చెమట మొహాలు, కొయ్య బెంచీలూ, గుడిగుడి గుంచం పరీ క్షలూ! 'పులికడుపు చలిచీమల పుట్టయయ్యె' - బాగా అన్నాడు మన కవి".

విద్యార్థులు పకపక నవ్వి ముందుకు సాగారు. ప్రదేశం సమతలంగా వుంది. కొండ వాగు దగ్గర యింది. అంతా ప్రకృతిమాత ఒడిలో పసిపిల్లల్లా మారిపోయారు.

అందులో ఎవ్వరికీ తాము బి.ఏ. చదువుతున్నామని గాని, పట్టణంలో - కాలేజీలో చూపే నాజూకుతనం మాటగాని జ్ఞాపకం లేదు.

వీరభద్రం షర్టు విప్పి భుజంమీద వేసుకుని నీటి దగ్గరికి దిగిపోతున్నాడు. కేశవరావు కోటు ఏదో చెట్టు కొమ్మకు తగిల్చి, రెండు పువ్వులు కోసి బూరా ఊదుతున్నాడు.

ప్రకాశం, సుబ్బారావు, నారాయణశర్మ ఇత్యాదులు పంచలు ఎగగట్టి తువాళ్లు తలకు చుట్టి అడవి కుంకుడు చెట్ల మీద ఆటలకు ఎగబడ్డారు. కామరాజు ఆయేటి

యూనివర్సిటీ పరీక్షల్లో ఫస్టుక్లాసు కోసం నీటివారలంట 'సరస్వతీ ఆకు' నిమిత్తం 'ట్రై' చేస్తున్నాడు.

సమీపంలో చిన్న పురాతన శివాలయం వుంది. శాస్త్రిగారు దానిలో విశేషాలు చూడడానికి వెళ్ళారు. ఎన్నాళ్ళనుంచో దానికి పూజా పురస్కారాలున్నట్టు లేదు. ముఖ మండపం మీద రాతి పలకలు కూలుతున్నాయి.

మండప స్తంభంమీద నాగరిలిపిలో శాసనం కనపడ్డది. శాస్త్రిగారు ఎట్లాగైనా దాన్ని చదవడానికి ప్రయత్నించారు గాని ఎక్కడా కొరుకుపడలేదు.

శివరాత్రికి వచ్చిన యాత్రికుల్లో ముఖ్యంగా స్త్రీ భక్తులు అరటిపళ్లు పిసికి నంది మూతికి రాయగా మిగిలిన చేతులను ఈ శాసనం మీద భక్తితో తుడుచుకోవడం మామూలు. అరటిపండు ముద్ద అక్షరాల మధ్య దూరి గడ్డకట్టి వాటి పోలిక ఏమీ తెలియ నివ్వడం లేదు.

"నిష్ఠదరిద్రులు – నానా కశ్మలం రాసి నిక్షేపం లాంటి శాసనం తగలబెట్టారు" అని శాస్త్రిగారు గొణుక్కుని దేవాలయం మెట్లమీద చదికిలపడి ఎదుట పారే

## పువ్వులు

**మొ**క్కలు మోసే
ముద్దు మూటలు పువ్వులు
మొక్కలు వేసే
రంగవల్లులు పువ్వులు
మొక్కలు చేసే
రంగు బొమ్మలు పువ్వులు
అల్పాయుష్కులే అయినా
అమందానంద ప్రదాతలు పువ్వులు
అద్భుత సృష్టి వైచిత్రికి ప్రతీకలు పువ్వులు
తమ సురుచిర సోయగాలను
తమ సుగంధ సౌరభాలను
తమ సుకుమార కోమలత్వాలను
తమ దరిచేరిన రసహృదయాలకు పంచి
పరవశింపజేస్తాయి పువ్వులు
తమ గుండెల నిండిన మధుర మకరందాలను
తమ ఒడి చేరిన భ్రమర శిశువులకు పట్టి
కడుపులు నింపుతాయి పువ్వులు
కవుల హృదయాలను కదిలించి
కవితా సృష్టిని వెలిగిస్తాయి పువ్వులు
నిరంతరం పరహితార్థం బ్రతికే పువ్వుల
గొంతులు కోసి అర్ధాంతరంగా అంతం చేయకండి
వాటిని తమ చిరు జీవితాలను
పరిపూర్ణంగా బ్రతకనీయండి
ఆఖరి శ్వాసవరకు అందరికీ
ఆనందామృతాలను పంచనీయండి
చివరికి తల్లి చెట్టు పాదాల మీద రాలి
తమ జన్మ ఋణం తీర్చుకోనీయండి

**–జి.నీలకంఠం**

వాగునూ, రంగు రెక్కల్తో త్రావ్యంగా రొదలు చేస్తూ ఎగిరే పక్షులనూ చూస్తున్నారు.

ఇంతల్లో విద్యార్థులు అడవంతా తిరిగి చూడవలసిన చెట్లు చూసి, పుణకవలసిన పువ్వులు పుణికి, జారవలసిన బండల మీద జారి, కొరకవలసిన కాయలు కొరికి, దేవాలయం దగ్గరికి చేరారు. మండపం సమీపిస్తూ ప్రకాశరావు ఆవేశపూరితంగా –

**"ఏజోదు చిందెనో ఈ రక్తగంధమ్ము**
**విఠ్ఠలాలయ శిలావేదులందు"**
**అందుకున్నాడు. వెంటనే కేశవరావు –**
**"ఏ వితంతువువైచెనే? 'రామబాణమ్ము'**
**తతశిలాతలిని ముద్రలు రహించు"**

సహాధ్యాయులు గొల్లుమన్నారు. మేష్టారు లేచి "భేష్ – బాగుందోయ్... మంచి పేరడీ! కవితావీధిలో చక్కని బతుకుతెరువు కనిపెట్టావు" అని కొండవాగువైపు నడిచారు.

అంతా హాయిగా జల్లులాడుతూ స్నానాలు చేసి ఒడ్డున ఒక మర్రిచెట్టు కింద విశ్ర మించి టీ సేవించి సిగరెట్లు వెలిగించారు. మధ్యాహ్నం 11 గంటలు దాటింది. లేచి తిరుగు ప్రయాణ సన్నాహం చేసి నెమ్మదిగా ఆటపాటలతో 12 గంటలకు బస్‌స్టాండుకు చేరారు.

కాని –

వెళ్ళవలసిన బస్సు దాటిపోయింది.

• • •

ఎటు వెళ్ళడానికీ తోచలేదు. శృంగవరపుకోట అట్టే బస్తీగాదు, పల్లెటూరూ గాదు, ఆనాడు. ఒకవైపు అప్పుడే తోసుకువచ్చే బస్తీ లక్షణాలూ, ఒకచెంప పూర్తిగా విడిచిపోని పల్లెటూరి చిహ్నాలూ కలిసి పెనగులాడుతున్నాయి, పట్నవాసపు పురోహిత పుత్రుడి పిలకా, క్రాపులాగ. అరవ కాఫీశాలలో ఇంకా భోజనాల ఏర్పాటు చెయ్యలేదు. శాస్త్రి గారికి ఎటూ పాలుపోలేదు.

విద్యార్థులు స్టాండు పక్క పడివున్న పాత బస్సు కొయ్యసీట్ల మీద చదికిలబడ్డారు. ఫొక్కు ఇరవయ్యో సెంచరీ ప్రాణాలు!

అయిదు నిమిషాలు అటుఇటూ చూసి వీరభద్రం అన్నాడు – "మేష్టారూ, ఇక్కడికి రెండు మైళ్ళ దూరంలో వెంకట్రమణపేట అని మావూరు వుంది. భోజనాలు చేసి కాస్త రెస్టు తీసుకుని సాయంకాలం బస్సుకు వద్దాం"

మేష్టరుగారిది ఒక విచిత్ర స్వభావం. గృహ యజమానితో పరిచయం లేనిచోట ఆయనకు మంచి నీళ్ళు వెళ్ళవు. కాని పిల్లలు బడలి వున్నారు. గత్యంతరం లేదు. ఒప్పుకున్నారు.

విద్యార్థులు పాత బస్సులోంచి ఒక్క దూకు దూకారు.

వీరభద్రం తండ్రి వెంకటావధాన్లు గారు పేటలో మాంచి సంపన్న గృహస్థు, పాతిక ముప్పై ఎకరాల పొలం – యాభైవేల వడ్డీ వ్యవహారం సాగుతోంది. తూర్పుఇళ్ళ పంపిణీలో కట్టిన పెద్ద లోగిలి.

మధ్యాహ్నం ఒంటిగంట సమీపం.

వెంకటావధాన్లు గారి దేవతార్చన గంట ఖంగున వినపడుతోంది.

శిష్యగణంతో అహోబలశాస్త్రి గారు అవధాన్లు గారి వసారాలో ప్రవేశించారు.

అప్పుడే ఎండ చురుకుతోంది. అందరి చొక్కాలూ తడిసి ముద్దయ్యాయి.

వీరభద్రం ఒక్కసారి లోపలికి వెళ్ళివచ్చి "నాన్నగారి దేవతార్చన అయిపోయింది. మనదే ఆలస్యం మళ్ళ కట్టుకోవచ్చు" అని చెప్పి తలో పట్టుపంచా తెచ్చి ఇచ్చాడు.

మేష్టారు 'స్నానం చెయ్యా'లన్నారు.

"గంగాళంలో తోడి సిద్ధంగా వున్నాయి పదండి" అన్నాడు వీరభద్రం.

చేతిసంచీలోంచి గళ్ల లుంగీ తీసి కట్టుకుని ఒక తువాలు పైన వేసుకొని శాస్త్రిగారు పెరటిలోకి వెడుతూండగా, అవధాన్లు గారు అప్పుడే దేవతార్చన ముగించి పెరటి వసారా లోకి వచ్చి మేష్టారిని చూసి "ఈ తురకెవడోయ్" అన్న అగ్నిహోత్రావధాన్ల ఫోజులో విసురుగా వెళ్ళి మడి పీటమీద కూచున్నారు.

దేవతార్చన పీఠంనుంచి వచ్చే నీరాజనపు పొగా, అగరువత్తుల సువాసనా ఆ ప్రాంతమంతా నిండింది.

విశాలాక్ష్మమ్మగారు పసుపు కుంకుమలతో, తలలోని మందారపూవుతో, అచ్చం పార్వతీదేవిలా వచ్చి వడ్డించారు.

అంతా భోజనాలు చేస్తున్నారు.

అవధాన్లు గారు ఒకటిరెండు కబళాలు పప్పూ అన్నమూ ఘుమఘుమలాడే పులుసు అనుపానంతో పుచ్చుకొని, కుశలప్రశ్నవతుగా అన్నారు – "బాబూ – మన యింటిపేరు ... కందర్పవారని గదూ... అన్నారు.. అయితే... గోదావరి జిల్లాకంతటికీ పేరుమోసిన కందర్ప వీరావధాన్లు గారు తమకు.."

"తాతగారు"

"అలా చెప్పండి" కమండలమంత రాగిచెంబు మండమీద పెట్టుకుని గడగడ మంచి తీర్థం పుచ్చుకుని దించి "ఆ మహానుభావుడు క్రమాంతస్వాధ్యాయి. శ్రౌత స్మార్తాల్లో నిధి. గొప్ప కుటుంబంలో పుట్టారు... బాబూ"

"కాని – ఆ చదువులు, ఆ బ్రాహ్మణత్వం ఏవండీ ఇప్పుడూ?"

"మాది... చిత్తగించారూ... గొప్ప శిష్ట కుటుంబమండి – మా ముత్తాత బ్రహ్మావధాన్లు గారంటే ఈ పట్టీకి అపరఆపస్తంబులని వాడుక. వేదశాస్త్రాలు జిహ్వాగ్రమందు తాండవించేవిట. నిరతాగ్నిహోత్రి. అట్లాంటి వంశంలో పుట్టి... మా నిర్భాగ్యుడు... చూశారూ... మొహాన్ని బొట్టేనా లేకుండా, గూడకట్లూ, సిగరెట్లూ తురక వేషాలూ... ఏం చెప్పం? లోకమంతా బ్రహ్మసమాధి గాళ్లతో నిండిపోతోంది"

"........"

శాస్త్రిగారికి వెన్నులో పొడిచినట్లయింది.

వీరభద్రం తల ఒంచుకున్నాడు.

కేశవరావు కళ్లు చిరచిరలాడాయి. తగిన దెబ్బ తియ్యాలని నిశ్చయించాడు.

విశాలాక్ష్మమ్మగారు మజ్జిగ వడ్డిస్తూ "ఎండ బడలికచేత గాబోలు మాష్టారికి ఏమీ సయించలే" దన్నారు.

భోజనాలు పూర్తిచేసి లేచి శాస్త్రిగారూ, శిష్యులూ, సావడిలో పాలగచ్చుమీద విశ్రమించారు,

వీరభద్రం ఏదో పనిమీద ఊళ్లోకి వెళ్లాడు.

• • •

కొంతసేపటికి అవధాన్లుగారు తడి అంగాస్త్రం భుజంమీద వుంచుకొని మడి ఉట్టిపడే వేషంలో సావిట్లోకి వచ్చారు.

పిల్లల్లో ఏవో గుసగుసలు ప్రారంభమయాయి. కేశవరావు ఏదో ప్లాన్ చేసినట్టు పిల్లల సర్దుబాట్ల వల్ల తెలుస్తోంది.

"అవధాన్లు గారు వారికి ఎదురుగా కూర్చుని అన్నారు -- "బాబూ, మీరంతా కాలేజీలో చదువుకుంటున్నవారేనా – మావాడూ, మీరూ ఒకటే క్లాసా?.... " ఇత్యాదిగా కొన్ని ప్రశ్నలు నడిచాక మళ్లా అన్నారు – "అయితే మీకు... కాలేజీలో ఏమేం చెబుతారు – ఏవో కొత్త శాస్త్రాలు చెబుతున్నారంటాడు మావాడు..."

శాస్త్రిగారు వీరభద్రం తెచ్చివేసిన పరుపు చుట్టను ఆనుకుని పరధ్యానంగా విశ్ర మిస్తున్నారు. మాగన్నుగా వుంది.

ప్రకాశరావు అందుకున్నాడు – "చరిత్ర, భూగోళం, గణితశాస్త్రం మొదలైనవేవో చెబుతారు, దానికేమిగానీండి – మా కేశవరావు దగ్గర ఒక కొత్త విద్య ఉంది. అది మీరు ముఖ్యంగా చూడదగ్గది. ఏమిటంటే, అతడు స్పిరిట్సుతో మాటలాడుతాడు. అనగా – గతించి స్వర్గాన వున్న మన పితృదేవతలను ఆహ్వానించి వారి అభిప్రాయాలూ, అభి రుచులు అన్నీ తెలుసుకోవడం, బతికి వున్న వారితోలాగానే ఇష్టాగోష్ఠి జరపడం. ఈ ప్రజ్ఞతో మా వాడు చాలామందిని వినోదింపజేస్తూంటాడు. దాంట్లో మావాడిది కొత్త తరహా".

అవధాన్లుగారు ఇంతకుముందు ఎప్పుడూ ఈ సంగతి వినలేదు. అత్యాశ్చర్యం కలి గింది. అదేదో ఎట్లా ఐనా చూడాలనిపించింది.

"ఈ ఇంగ్లీషు చదువుల వల్ల ఎంతటి వింత సంగతులు వింటున్నాం – బాబూ అట్లా మాట్లాడడానికి ఏదో ఒకవేళ అని వుంటుంది గాబోలు" అన్నారు.

ప్రకాశరావు "అబ్బే, అఖ్ఖర్లేదండి – మావాడు ఎప్పుడుబడితే అప్పుడు ఆవహింప జెయ్యగలడు. మీ పెద్దల నెవరినైనా ఆవహించి చూస్తారా?... పేరు చెప్పండి" అన్నాడు.

"ఐతే – మా ప్రపితామహులు బ్రహ్మావధానులు గారితోటే మాటాడాలని కుతూహ లంగా వుంది" అన్నారు అవధానులు గారు స్థిమితంగా కూర్చుని.

ప్రకాశరావు 'కేశవరావ్' అన్నాడు. అతడు ముందుకు వచ్చి పద్మాసనం మీద కూర్చున్నాడు, సీరియస్‌గా. మెస్మరైజ్ చేస్తూన్నట్టు అతని ముఖంమీద మూడుసార్లు చెయ్యితిప్పి ప్రకాశరావు అన్నాడు – "బాబుగారూ, పితృదేవతలను ఆహ్వానిస్తున్నాడు. వారు మనకంటె పెద్దలు గనుక ఏమన్నా అపార్థం చేసుకోకూడదు. మధ్యగా కదిలితే మిమ్మల్నీ, మమ్మల్నీ గూడా శపించి చంపేస్తారు. పైని తమ చిత్తం".

"అబ్బెబ్బే – ఎంతమాట! విద్య చూడాలనే కుతూహలం.. కానీండి" అన్నారు అవధాన్లుగారు.

కేశవరావు ధ్యాన నిమీలిత నేత్రుడై మూడు ఊగులు ఊగి మాటాడబోతున్నాడు. పిల్లలు ముసిముసి నవ్వుల్తో పరికిస్తున్నారు.

కేశవరావు ఆవేశంలో అన్నాడు –

"అబ్బా – ఎన్నాళ్ళకు మళ్లా మానవలోకానికి రావలసి వచ్చింది ... అంతా మారి పోయింది... ఒక్కడూ నిజమైన శ్రోత్రియ బ్రాహ్మడు కనిపించడం లేదు. మా కుటుంబ పరిస్థితి ఎలా వుందో – ఎవరయ్యా – నన్ని క్కడికి ఆహ్వానించింది"

అవధాన్లు గారి ఆశ్చర్యానికి మేరలేదు. "తాతగారూ... నేను వెంకటావధాన్లను..." అన్నారు.

"వెంకన్నా... ఎన్నాళ్ళకు చూశానురా మళ్లా నిన్ను... ఎంత ప్రయోజకుడవయావు! – ఎన్ని భూములు సంపాదించావు! ఎంత దబ్బు నిలువ చేశావు! గొప్ప 'గృహస్థు' వనిపించుకున్నావు..."

అవధాన్లు ముఖం వికసిస్తోంది.

"కాని మా కడుపున బుట్టి ఇంత నిర్భాగ్యుడివై పోతావనుకోలేదు."

అవధాన్లుగారు ఉలిక్కిపడి చూశారు.

"ఉపనయనం అయిన వెంటనే 'స్వాధ్యాయాన్మాప్రమదః' అన్న వేదప్రమాణంగా వేదం చెప్పుకున్నావురా" (కేశవరావు రెండోభాష సంస్కృతం)

ఈ ఉపనిషద్వాక్యం ఉచ్చరించేసరికి అవధాన్లు గారికి ముచ్చెమటలూ పట్టాయి.

"మానాడు యెనభైరెండు పన్నాలూ కానివాణ్ణి పంక్తి బాహ్యుడుగా చూసేవాళ్లంరా. 'యావజ్జీవం హోష్యామి' అని ప్రమాణం చేసి ఒకనాడైనా అగ్నిహోత్రం చేసిన పాపాన పోయావు – తద్దినంనాడు ప్రాయశ్చిత్తంతో తప్ప? ఇప్పుడు నువ్వీ ప్రాంతానికి ఒక సనాతన ధర్మ ప్రతినిధివిట గదూ బాబూ? సనాతన ధర్మమంటే ఏమిటో నీకేగాదు ఈ చుట్టూ పదిమైళ్ళలో ఎవరికైనా తెలుసునూ? అజ్ఞానుల దగ్గర మీరు ఘనులు – తల నున్నగా గొరిగించి పిలకపెట్టడంతోటే సనాతన మతం సిద్ధిస్తే సనాతన మతస్థుడు కానివాడెవడ్రా? 'దేవపితృ కార్యాభ్యాం నప్రమదితవ్యమ్' అని శ్రుతి ఘోషిస్తూ వుంటే – కోర్టు వ్యవహారాల మీద వుండే శ్రద్ధ నీకు ఒక నాడేనా పితృకార్యం మీద వుండా నాయనా? బ్రాహ్మడికి వడ్డీవ్యాపారం ఏమిట్రా బాబూ? కుశీదవృత్తి సర్వశాస్త్ర నిషిద్ధం కాదుట్రా? – ఇంత శ్రోత్రియ కుటుంబంలో పుట్టి నీవు చెడడమే కాకుండా కుర్రకుంకకు హూణవిద్య చెప్పిస్తున్నావూ? – అవున్లే, నీకు లేని బ్రాహ్మణ్యం వాడికెలా వస్తుంది? నీ కొడుకు వాడూ! ఇంతకూ నిన్న నవలసిన పనేముంది – అంతా కలియుగం – కలియుగం".

మెల్లగా కేశవరావు కళ్లు విప్పి చూశాడు. అవధానుల గారి మొహాన నెత్తురు లేదు. ఆయన రుసరుసలాడుతూ దిగ్గున లేచి ఏవైపూ చూడకుండా ఇంట్లోకి వెళ్ళిపోగానే విద్యార్థులంతా కేశవరావు మీద పడి ఒకటే నవ్వు!

"మేష్టారూ, సామాను సర్దమన్నారా" అన్నాడు సవినయంగా కేశవరావు. శాస్త్రిగారు ఉక్కిరిబిక్కిరిగా నవ్వుతూ "చాల్లేవోయ్ – ముసలాయన మీద ఎంత కసి తీర్చుకున్నావ్?" అన్నారు చేతిసంచీ పుచ్చుకు లేస్తూ.

వీరభద్రం వచ్చి ఈ హాస కోలాహలానికి తెల్ల బోయి నిలుచుండగా శాస్త్రిగారు 'లేవండి, బస్సు టైమవుతోంది' అని ప్రయాణపు తొందర హెచ్చించారు.

■

## ఆడు సానియా ఆడు!

ప్రత్యర్థుల్ని ఎదిరించి
ప్రేక్షకుల్ని అలరించి
సాంప్ర'దయ్యాల్ని' వెక్కిరించి
'ఫత్వా'ల్ని ధిక్కరించి–
ఆడు సానియా ఆడు!

ఉత్సాహం ఉరకలెత్తగా
పౌరుషమే పైచేయిగా
నూరుకోట్లూ నీ నీడగా
నువ్వే ఒక అడుగుజాడగా–
ఆడు సానియా ఆడు!

'గ్రాండ్‌శ్లామ్' పథాన
పరిణిత సర్వీసున
పిడుగు చందాన
మెరుపు వేగాన–
ఆడు సానియా ఆడు!

భూగోళమే బంతిగా
అంతరిక్షమె కోర్టుగా
పాలపుంతే రాకెట్‌గా
విశ్వరూపమె దిశగా–
ఆడు సానియా ఆడు!

'నీ దారికి అడ్డులేదు'
'మతమన్నది మత్తుమందు'
టెన్నిస్‌కే దేశమందు
బ్రహ్మరథం ముందుముందు–
ఆడు సానియా ఆడు!

మన బిర్యానీ సాక్షిగా
టీషర్టుకే గౌరవంగా
'ఎమినెమ్' నేపథ్యంగా
'హిప్–హాప్' స్ఫూర్తిగా–
ఆడు సానియా ఆడు!

చలనానికె సంచలనమై
తేజానికె ఉత్తేజమై
అసాధ్యాన్ని తలక్రిందులు చేస్తూ
ఆశ్చర్యార్థకాన్ని ఆలోచనలో పడేస్తూ–
ఆడు సానియా ఆడు!

ఒక పెనుతుఫానుగా
ఒక తీవ్ర భూకంపంగా
ఒక మహాయుద్ధంగా
ముప్పేట దాడిగా–
ఆడు సానియా ఆడు!

దేశమాత దీవెనలతో
ఫోర్‌హ్యాండ్ షాట్లతో
కడదాకా నిలకడగా
గెలుపు గుర్రపు స్వారిగా–
ఆడు సానియా ఆడు!

విజయానికె విజయంగా
క్రీడా నిఘంటువున క్రొత్తపదంగా
కదిలే విద్యుత్ కేంద్రంగా
ఆటకే ఒక అందానివిగా–
ఆడు సానియా ఆడు!

*(టెన్నిస్ తార సానియా మీర్జా యు.ఎస్. ఓపెన్ తర్వాత 32వ ర్యాంకుకు ఎగబాకినందుగ్గాను అభినందనలతో...)*

–'లకుమ'